క్లుప్తంగా

విరలేశ్వరుడికి లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు: భట్టిప్రోలులో దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగాపార్వతి సమేత విరలేశ్వరస్వామి దేవాలయంలో గురువారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదబ్రాహ్మణులు దండిబొట్ల ఛాయానాథ్‌బాబు ఆధ్వర్యంలో వేదబ్రాహ్మణులు స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన, శాస్త్రోక్తంగా జరిపారు. స్వామివారికి మారేడు దళాలతో వేంకటేశ్వర భజన సమాజం భజన నిర్వహిస్తూ ఊరేగింపుతో స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. సాయంత్రం గోపూజ జరిగింది. రాత్రి నిర్వహించిన కార్తిక వన సమారాధనలో భక్తులు కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వనసమారాధన ఆహ్వాన కమిటీ నిర్వాహకులు ఆదిన వెంకట సుబ్బారావు, మేడూరి వీరయ్య, వంగర నాగేశ్వరరావు, సభ్యులు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న ఆలయ పునఃప్రతిష్ఠా పనులు




గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామంలో అత్యంత ప్రాచీనమైన దేవాలయంగా ప్రసిద్ధి గాంచిన భమరీ దుర్గాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్టా కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ధ్వజస్తంభం నిర్మాణానికి సంబంధించిన కలపకు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఈ తరువాత దానిని చెక్కడం ప్రారంభించారు. అర్చకులు ఆమంచి సృజన్ కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గరిగపాటి వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నరేంద్ర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన బాలా త్రిపుర సందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో 18వ రోజు స్వామి వారికి ప్రాతః కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం, నవహారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రతి రోజూ సాయంత్రం నిత్య కల్యాణం జరుపుతున్నారు. కార్తిక మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు జంపని అంజయ్య తెలిపారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతి కార్తిక సోమవారం ఉదయం వేళల్లో కల్యాణం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



బాపట్ల అర్బన్: బాపట్ల కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో అత్యంత వైభవంగా 558 కలశాలతో, 1200 మంది భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని బుధవారం ఆచరించారు. మచిలీపట్నంకు చెందిన ద్రుక్సిద్ధాంత పంచాగకర్త పండిత శ్రీమాన్ ముత్తేవి శ్రీనివాస శశికాంత్ యాజ్ఞీకంలో లలితాత్రిపురసుందరీపీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు పర్యవేక్షణలో మేడూరి వెంకట అప్పలాచార్యులు, కొల్లిపర ప్రసాద్ స్వామి, శ్రీనివాసుల విఖనసమూర్తి, రొంపిచర్ల కేశవాచార్యులు, పరాశరం రఘురాం, పంగులూరి కౌండిన్య శర్మల అర్చక సహకారంతో, శ్రీ సత్యసాయి సేవాసమితి, బెస్తపాలెం రామాలయం కమిటీ, షిర్డీ సాయి భజన మండలివారి సేవా సౌజన్యంతో విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని కోన రమాదేవి ప్రారంభించారు. నాళం శ్రీనివాస్, కృష్ణప్రశాంత్, కృష్ణసాయి పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

రేపల్లె రూరల్: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన పట్టణంలోని 27వ వార్డులో గురువారం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు వివరాల మేరకు 27వవార్డుకు చెందిన బషీర్‌వున్నీసాకు చెందిన పూరింటికి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెందాయన్నారు. గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించటంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశామన్నారు. ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమవ్వగా రూ.2లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ప్రతి ఇంట్లో నవరత్నాల వెలుగులు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కోమలిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



కోమలిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కోమలి(పిట్టలవానిపాలెం): ప్రతి ఇంటిలోనూ జగనన్న అమలు చేసిన నవరత్నాల వెలుగులు విరజిమ్ముతున్నాయని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. పిట్టలవానిపాలెం మండలం కోమలి గ్రామంలో గురువారం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. అనంతరం కోమలి గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ షేక్ బాజి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ సభ్యులు చెన్నుబోయిన గంగయ్య, సర్పంచ్‌లు మంతెన గంగరాజు, మాధవరావు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అల్లూరి సురేష్‌బాబు, మాజీసర్పంచ్ బడుగు ప్రకాశరావు, అల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి శివారెడ్డి, రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, బీసీ సెల్‌యూత్ కన్వీనర్ గోపి, దేవేంద్రరాజు, చేబ్రోలు వీరయ్య, ఎనుముల కోటేశ్వరరావు, కుంభం ప్రసన్నరాజు ఉన్నారు.

దోనేపూడిలో...

కొల్లూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని దోనేపూడి సర్పంచి వాగోలు గౌతమి అన్నారు. గురువారం మండలంలోని దోనేపూడి సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ఈసందర్భంగా ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలోని కోటిపల్లి, ఆలపాటినగరం, దోనేపూడి గ్రామాలలోని లబ్ధిదారులకు రూ. 35.30 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ అయిల సుబ్బారావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఈఓపీఆర్‌డీ సీహెచ్ రవిబాబు, నాయకులు పాల్గొన్నారు.

పేటేరులో...

రేపల్లె రూరల్: దేశానికి పట్టుగొమ్మలైన పల్లె సీమల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. మండలంలోని పేటేరు-2 గ్రామం సచివాలయ కేంద్ర ఆవరణంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా సచివాలయ సమీపంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ కనపర్తి వసుమతి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఫరీద్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కె.రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



గణపవరం సచివాలయంలో వెల్ఫేర్ బోర్డు ఆవిష్కరించిన ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి



వరహాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ యల్లమాటి మోహన్, నాయకులు

గణపవరంలో..

గణపవరం(కర్లపాలెం): గతంలో ఎవరూ అమలు చేయని రీతిగా సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి సంక్షేమ పథకాల సారథిగా నిలిచారని ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం గణపవరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ దేవరకొండ అంకమ్మ అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ వెల్ఫేర్ బోర్డు ఆవిష్కరించి సభలో మాట్లాడారు. గ్రామ సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, పార్టీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు జేసీఎస్ కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వర రెడ్డి, నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, మందపాటి పరమానందకుమార్, గొర్ల సుబ్బారావు, గొర్రుముచ్చు మీరయ్య ఉన్నారు.

వరహాపురంలో...

వరహాపురం(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించారని ఎంపీపీ యల్లమాటి మోహన్ అన్నారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, షేక్ బాజీ దున్నా మేరీసుబాబు, యల్లమాటి బాస్కర్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలపాడులో...

ఆలపాడు(వేమూరు): వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామ సచివాలయం వద్ద జెండావిష్కరణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గాదె శివరామకృష్ణ రెడ్డి, నారంశెట్టి సురేష్, ఉపసర్పంచ్ తన్నీరు సాంబయ్య, ఎంపీటీసీ విప్పర్ల రమేష్, చేబ్రోలు బోడయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గోకరాజు నల్లిబోయినవారిపాలెంలో..

పిట్టలవానిపాలెం: మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామంలో డిసెంబర్ 1వ తేదీన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సాధించిన రంగా



రేపల్లె: పేదల పక్షపాతి వంగవీటి మోహనరంగా భౌతికంగా దూరమైనా, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని ఓల్డ్‌టౌన్‌లో ఏర్పాటు చేస్తున్న వంగవీటి మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పేదల ఇళ్ల పట్టాల కోసం దీక్షలు చేసి పేదలపక్షపాతిగా పేరొందారన్నారు. రంగాకు ప్రజల్లో ఉన్న అభిమానం చూసి ఓర్వలేక నాడు టీడీపీ నాయకులు తమ కుట్రలతో హతమార్చారని విమర్శించారు. ప్రజాస్వామ్య బద్ధంగా చేస్తున్న నిరాహార దీక్షను ఆసరాగా చేసుకుని ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగాను అతి కిరాతకంగా టీడీపీ నాయకుల కనుసన్నల్లో హత్య చేసిన సంఘటనను ప్రజలు మరీ ముఖ్యంగా కాపు వర్గం మరువలేదన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా రేపల్లె పట్టణంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవటం శుభసూచికమన్నారు. రహదారి విస్తరణలో తొలగింపునకు గురైన ప్రాంతంలో మహాత్మ గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాల ఏర్పాటుకు మున్సిపాలిటీ పూర్తిసహకారం అందిస్తుందని చెప్పారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్‌లు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వైఎస్సార్ సీపీ నాయకులు ఐనాల సాంబశివరావు, చిమటా బాలాజీ, తులసీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తికమాసం ఎంతో శుభప్రదం

భట్టిప్రోలు విరలేశ్వరస్వామి దేవాలయంలో మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రత్యేక పూజలు



విరలేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: కార్తికమాసం ఎంతో శుభప్రదమైనదని....ఈ మాసానికి సమానమైన మాసమేది లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలులో అతి ప్రాచీనమైన దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగా పార్వతి సమేత విరలేశ్వరస్వామి వారిని గురువారం మంత్రి నాగార్జున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఈ కార్తిక మాసంలో దారిద్ర్యమెచనలు కలిగిన ప్రజలు ఏకభుక్తము, నిరహారాది వ్రతాలు చేస్తారని తెలిపారు. శివ, విష్ణువుల ఇరువురి పూజ కొరకు ఈ మాసం పవిత్రమైనదని అన్నారు. ఈ మాసంలో ప్రతి రోజూ పర్వదినమే ఐనప్పటికి కొన్ని ముఖ్యమైన పర్వదినాలు మరింత ఫలప్రదమైనవని చెప్పారు. దేవాలయ అర్చకుడు దండిభొట్ల ఛాయానాథ్‌బాబు పూజలు జరిపించారు. గ్రామానికి చెందిన జంజనం కేదార్‌నాథ్ దేవాలయంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన శివునికి మంత్రి నాగార్జున నమస్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ దారా రవి కిరణ్మయి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు తూనుగుంట్ల శ్రీధర్, కుందేటి రమేష్, పీజీ అరుణ్‌శాస్త్రి, మద్దుల గిరిధర్, తలకొల యలమంద, దారా చెన్నయ్య, షేక్ ఇస్మాయిల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన భట్టిప్రోలుకు చెందిన మండే కిషోర్, గుండాల అభిలాష్ కుటుంబ సభ్యులను మంత్రి నాగార్జున పరామర్శించారు.

కూరగాయల ప్రాధాన్యం తెలుసుకోవాలి



రేపల్లె రూరల్: విద్యార్థులు తాము తినే ఆహార పదార్థాల గురించి తెలుసుకోవాలని మోంట్‌ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్ అన్నారు. వెజిటేబుల్ డే సందర్భంగా పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు కూరగాయాల ప్రాధాన్యత తెలియజేసే విధంగా నృత్యప్రదర్శన చేశారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు బేతపూడిలో కమ్యూనిటీ హాలు ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని బేతపూడిలో రూ 1.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేసుకుని సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. వేదికతో పాటు విశ్రాంతిగదులు, చుట్టూ ప్రహరీ, పచ్చదనంతో పరచుకున్న మొక్కలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ , ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) హాజరై ప్రారంభించనున్నారు. ఇళ్లలో చిన్న శుభ కార్యం చేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని, కమ్యూనిటీ హాల్ నిర్మించి తమ కలను ఎమ్మెల్యే ఆర్కే నిజం చేశారని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బడ్జెట్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న రేపల్లె పట్టణాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు కృషితో గోల్డ్‌సిటీగా అభివృద్ధి జరుగుతోందన్నారు. పట్టణంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక దృష్టిసారించామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వార్డులలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలేమైనా తమ దృష్టికి వస్తే పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని కోరారు. అనంతరం 2024–25 సంవత్సరపు బడ్జెట్ అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కమిషనర్ విజయసారథి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కూలిన విద్యుత్ స్తంభం



రేపల్లె-తెనాలి రహదారిపై కూలిన విద్యుత్ స్తంభం

కొల్లూరు: రద్దీగా ఉండే రహదారిపై ఉన్నఫళంగా విద్యుత్తు పోల్ కూలిపడిన సంఘటన మండలంలోని దోనేపూడి శివారు ఆలపాటి నగరం వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆలపాటి నగరంలో ఇటీవల అభివృద్ధి పనులలో భాగంగా డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు, డ్రైనేజ్ పూడికతీత పనులు చేపట్టారు. ఈప్రాంతంలో డ్రైనేజీ వెంబడి విద్యుత్తు శాఖ నూతన స్తంభం ఏర్పాటు చేసింది. డ్రైనేజ్ వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం వద్ద భూమిలో మెతక ఏర్పడటంతో పోల్ రహదారికి అడ్డంగా కూలింది. విద్యుత్తు పోల్ కూలేసమయంలో ఆప్రాంతంలో ఎటువంటి వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. విద్యుత్తు శాఖ సిబ్బంది తక్షణం స్పందించి స్థానికుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా కూలిన పోల్‌ను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు.

గాయపడిన కార్మికుడి మృతి

మంగళగిరి: నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి గాయపడిన భవన నిర్మాణ కార్మికుడు నాగేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సచివాలయం ఎదురుగా అనుమతుల్లేకుండా భవన నిర్మాణం జరుగుతున్నా సచివాలయ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో కార్పొరేషన్ అధికారులు దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. నగర కమిషనర్ నిర్మల్ కుమార్, అడిషనల్ కమిషనర్ కె. హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ ఎం.వి. లక్ష్మీపతిరావు గురువారం భవనాన్ని సందర్శించి అనుమతులు గురించి వివరాలు సేకరించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించామని, ప్లానింగ్ సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలో గురువారం ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం సమక్షంలో కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మూకిరి ప్రకాశరావు వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా ఎల్.చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా పరిశ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగమల్లేశ్వరరావు, శివజ్యోతి, ఆంజనేయులు, శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా రామారావు, ప్రసన్నలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, డీసీలుగా జె.శ్రీనివాసరావు, నాగాంజనేయులు, లక్ష్మయ్య, రమణ, అర్జున్, దుర్గారావులను వివిధ శాఖలో పరిశ శ్రీను, సాంబశివరావు, చంటిబాబు, భూషయ్యలను ఎన్నుకున్నారు. ప్రత్యేక సలహాదారులుగా రామశర్మ, అనంతరామ్, ఆర్‌వీ సుబ్బారావులను ఎన్నుకున్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఎంపికైన విద్యార్థులు



శిక్షణకు ఎంపికైన విద్యార్థులు

బాపట్ల: వ్యవసాయ ఆధారిత వ్యవస్థాపకతపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని ఉత్తమ వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశాన్ని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కల్పిస్తుందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలకు చెందిన ఎనిమిది మంది బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థినులు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో గల ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్ మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంస్థలో శిక్షణకు ఎంపికయ్యారని తెలిపారు. ఈమేరకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావు అభినందించారు. గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లోని లైమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ ట్రైనింగ్ సంస్థలో శిక్షణకు ఎంపికయ్యారని, వ్యవసాయ వస్తువుల ఎగుమతి– దిగుమతుల విధానంపై వారికి శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. డిసెంబర్ 4 వ తేదీ నుంచి 24వ తేదీ వరకు 21 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఐడీపీ, ఎన్ఏహెచ్‌ఏపీ కో–ఆర్డినేటర్లు డా. కె.చంద్రశేఖర్, డా. వి.సీతారాంబాబు, డా. బి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

బాపట్ల అర్బన్, భట్టిప్రోలు: ఇంటర్మీడియట్ విద్యార్థులకు భట్టిప్రోలు మండలంలో బోర్డు పరీక్షలు రాసేందుకు పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్ కోరారు. ఇంటర్ పరీక్ష రాయాలంటే రేపల్లె, నగరం, చెరుకుపల్లిలో వెళ్లాల్సి వస్తుందన్నారు. విద్యార్థులు ప్రయాణం చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్, కార్యదర్శి బి.ఆర్యులు కలిసి డీవైఈఓ ఎర్రయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లూరు, వేమూరు మండలాల్లో పరిసర ప్రాంత గ్రామాల విద్యార్థులు ఇంటర్ బోర్డు నిర్వహించే పరీక్షలు రాయాలంటే వాళ్ల గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాల వెళ్లడానికి 30 నుంచి 35 కిలోమీటర్ల వరకు ప్రయాణించాల్సి వస్తుందన్నారు. భట్టిప్రోలు మండలంలో మూడు జూనియర్ కళాశాలలో ఉన్నాయని, ఆ కళాశాల పరిధిలో 750 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వీరందరికీ ఒక కామన్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మహాకవి గురజాడకు ఘన నివాళి



ప్రసంగిస్తున్న రచయిత్రి కావూరి సత్యవతి

తాడేపల్లి రూరల్: మహాకవి గురజాడ వర్ధంతిని గురువారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రచయిత్రి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని కావూరి సత్యవతి పాల్గొన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ ఒకరని తెలిపారు. సమాజంలో పాతుకుపోయిన మూఢాచారాల్ని పారదోలడానికి ఆయన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు.అందుకు కన్యాశుల్కం నాటకం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయాలు ఉదాహరణగా నిలుస్తాయని తెలిపారు. విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర బాధ్యుడు పి. మురళీకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లి మహిళ కుట్టు శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రెండు బ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా సాధికారత కోసం ఎంబ్రాయిడరీ శిక్షణ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, ఎంబీవీకే బాధ్యులు పి. విజయ, తాడేపల్లి విజ్ఞాన కేంద్రం బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ బి. ఇంద్రాణి, ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, అరవింద, ఉపాధ్యాయులు హనుమంతరావు పాల్గొన్నారు.

వైభవంగా శివ కల్యాణ మహోత్సవం



మంగళగిరి: స్థానిక శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం(శివాలయం) 53వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అత్యంత వైభవంగా శివ కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శివుడు జన్మ నక్షత్రం ఆరుద్ర నాడు ఏటా కల్యాణాన్ని అర్చకులు తెలకదేవరపల్లి శ్యాంసుందరశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. కార్యక్రమాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, మురళి దంపతులతో పాటు ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ శర్మ పర్యవేక్షించారు.